
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
బుధవారం 31 జూలై 2024



వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఏయూ

- ఆ దిశగా దృష్టి పెట్టాలని అధికారులకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశం
- ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మోడల్‌గా తయారు చేస్తే దాన్ని అన్ని విశ్వవిద్యాయాల్లో అమలు చేస్తాం
- నైపుణ్యాల పెంపును విద్యలో అంతర్భాగం చేయాలి

.7లో

ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్ధం

షెడ్యూల్ విడుదల
వచ్చే నెల 6న నోటిఫికేషన్

- 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ
- 30న పోలింగ్
- సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు
- విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో అమలులోకి ఎన్నికల కోడ్
- బదిలీలు, శంకుస్థాపనలకు బ్రేక్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ పదవి (స్థానిక సంస్థల కోటా)కి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మెజారిటీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 2021 డిసెంబరులో స్థానిక సంస్థల కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కాగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి ఎన్నికయ్యారు. అయితే వంశీకృష్ణ గత ఏడాది నవంబరులో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపు పేరుతో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా శాసన మండలి చైర్మన్ ప్రకటించారు. ఆ స్థానంలో మరొకరిని ఎంపిక చేయాల్సి ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ సభ్యులు కలిసి ఎమ్మెల్సీని ఎన్నుకోవలసి ఉంది. దీనికి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు.

ఆగస్టు 6వ తేదీన ఎన్నిక నోటిఫికేషన్ జారీచేస్తారు. ఆగస్టు 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ ఉపసంహరణకు 16వ తేదీ వరకు గడువు ఉంటుంది. అదే నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబరు 3వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. సెప్టెంబరు 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఎన్నికల అధికారి అయిన విశాఖపట్నం జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఎన్నికలలో ఎవరు గెలిచినా వారి పదవీ కాలం 2027 డిసెంబరు ఒకటో తేదీ వరకు ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ మంగళవారం విడుదల చేసినందున ఎన్నికల కోడ్ మూడు జిల్లాలలోను అమలులో ఉంటుందని కలెక్టర్ స్పష్టంచేశారు. కోడ్ ముగిసేంత వరకూ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు ఉండవు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ఉండవు.

రహదారుణం

అధ్వానంగా ఎ.శనివారం రోడ్డు

- రూ.రెండు కోట్ల ఉపాధి నిధులు మంజూరు
- నిధుల విడుదలలో వైసీపీ ప్రభుత్వం కాలయాపన
- ప్రస్తుత వర్షాలకు దారుణంగా తయారైన రహదారి

చింతపల్లి, జూలై 30:

మండలంలోని జాజుపాలెం-అంజలి శనివారం ప్రధాన రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి ఛిద్రమైంది. దీంతో ఆదివాసీలు ఈ మార్గంపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

మండలంలోని జాజులపాలెం నుంచి అంజలి శనివారం వరకు నాలుగు కిలోమీటర్లు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు ఆదివాసీలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. దీనిని గుర్తించిన తెలుగుదేశం ప్రభుత్వం 2018లో ఉపాధి హామీ పథకంలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించింది. 2019 డిసెంబరులో రూ.రెండు కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్ 2020లో పనులు ప్రారంభించాడు. అయితే నిధులను వైసీపీ ప్రభుత్వం మంజూరు చేయకుండా కాలయాపన చేసింది. ఎట్టకేలకు గత ఏడాది రూ.1.3 కోట్లు విడతల వారీగా విడుదల చేసింది. దీంతో కాంట్రాక్టర్ 500 మీటర్లు సీసీ రోడ్లు నిర్మించగా.. మరో మూడు కిలోమీటర్లు జీఎస్‌బీ లేయర్ వేశాడు. అయితే మలివిడత నిధులు విడుదల జాప్యం కావడం వల్ల రహదారి నిర్మాణాలు నేటి వరకు పూర్తికాలేదు.



రహదారిపై ఏర్పడిన గోతులు



వర్షాలకు ఘాట్‌లో కోతకు గురైన రహదారి

ప్రయాణం సాహసమే..

అంజలి శనివారం రహదారిపై ప్రయాణమంటే సాహసమేనని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో 1.5 కిలోమీటర్లు ఘాట్ ఉన్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఘాట్ రోడ్డు కోతకు గురైంది. పలుచోట్ల జీఎస్‌బీ లేయర్ కొట్టుకుపోయింది. రహదారిపై అడుగడుగునా భారీ గోతులు ఏర్పడ్డాయి. పలుచోట్ల రహదారి ఆనవాళ్లు కనిపించలేదు. కార్లు, ఆటోలు గ్రామానికి వచ్చే పరిస్థితి లేదు. కేవలం జీపులు, ద్విచక్ర వాహనాల్లో మాత్రమే ప్రయాణించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు సైతం తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అధిక వర్షం కురిస్తే రహదారి బురదమయమైపోతుంది. రోగులు, గర్భిణులను డోలిపై ప్రధాన రహదారి వరకు తరలించాల్సి వస్తుందని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. అంజలి శనివారం రహదారి నిర్మాణాలు నూతన ఎన్డీయే కూటమి ప్రభుత్వమే పూర్తిచేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.

రహదారి పూర్తి చేయాలి



ఎ.శనివారం రహదారి పూర్తికాకపోవడం వల్ల ఆదివాసీలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోగులు, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. గత ప్రభుత్వం ఈ రహదారిని పూర్తి చేయలేదు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిర్మాణాలకు అవసరమైన నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలి. - **పేట్ల పోతురాజు**, సీపీఐ మండల కార్యదర్శి

గిరిజనాభివృద్ధికి పెద్దపీట

రద్దయిన అడవి బిడ్డల పథకాల పునరుద్ధరణ

- ఫీడర్ అంబులెన్స్‌ల వ్యవస్థ బలోపేతం
- వైసీపీ నిర్వీర్యం చేసిన ట్రైకార్, ఐటీడీఏ, జీసీసీలకు పునరుజ్జీవం
- గిరిజన సంక్షేమంపై జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



(పాడేరు- ఆంధ్రజ్యోతి)
ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తీవ్ర అన్యాయానికి గురైన అడవి బిడ్డలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమానికి సంబంధించి మంగళవారం అమరావతిలో నిర్వహించిన సమీక్షలో గిరిజనులకు తమ ప్రభుత్వం చేపట్టబోయే చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక స్పష్టత ఇచ్చారు. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు సంబంధించి రద్దు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం విధిగా పునరుద్ధరిస్తుందని, అడవి బిడ్డల జీవనోపాదులను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి సైతం గిరిజనుల సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి గిరిజనుల అభివృద్ధికి పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టేందుకు నిర్ణయించారు. ప్రధానంగా గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మారుమూల పల్లెలకు అత్యవసర సేవలు అందించే ఫీడర్ అంబు లెన్స్‌ల వ్యవస్థ బలోపేతం, విస్తరణ, గర్భిణులకు వసతి గృహాలు ఏర్పాటు, ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి, బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ వంటి విద్యా పథకాలను పునరుద్ధరించి, పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే వైసీపీ నిర్వీర్యం చేసిన ట్రైకార్, ఐటీడీఏ, జీసీసీ వంటి సంస్థలను బలోపేతం చేసి, వాటి ద్వారా గిరిజనులకు మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు.

ప్రతి వరద బాధితుడికి సాయం పక్కాగా అందాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశం



కూనవరం మండలం పెర్కూరు గ్రామంలో వరద సాయంపై ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే శిరీషా

పాడేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి వరద బాధితుడుకి ప్రభుత్వ సాయం పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి వరద బాధితుడుకి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేలు ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం అందిస్తున్న సంగతి తెలిసిందే. కూనవరం మండలం పెర్కూరు గ్రామాన్ని మంగళవారం సందర్శించి, బాధితులతో స్వయంగా మాట్లాడారు. తాజాగా ప్రభుత్వం అందిస్తున్న రూ.3 వేలు ఆర్థిక సాయంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి బాధితుడికి ప్రభుత్వ సాయం కచ్చితంగా అందించాలన్నారు. చిన్నార్‌కూరులో ... మిగతా 8వ పేజీలో

ఉరకలేస్తున్న సరియా



ఉధృతంగా పారుతున్న సరియా జలపాతం

మండలంలోని జీనబాడు పంచాయతీ పరిధిలోని సరియా జలపాతం ఉరకలేస్తోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జలపాతం కనువిందు చేస్తోంది. -అనంతగిరి

మత్స్యగెడ్డకు జలకళ



మండలంలోని సుజనకోట, కుమ్మరిపుట్టు ప్రాంతాల్లో ప్రవహించే మత్స్యగెడ్డ నీటితో కళకళలాడుతోంది. ఈ ఏడాది వేసవి ప్రారంభంలో మత్స్యగెడ్డ అడుగంటిపోగా.. ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. -ముంచంగిపుట్టు

సప్పర్ల ఆశ్రమ విద్యార్థి మృతి

- టెన్త్ విద్యార్థికి కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు
- వైద్యం చేయించకుండా స్వగ్రామానికి పంపిన పాఠశాల సిబ్బంది
- వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్



శ్యామ్యూల్ (ఫైల్)

సీలేరు, జూలై 30:

జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీలోని ఎం.బూసుకొండ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి కడుపునొప్పి, వాంతులు, విరోచనాలతో సోమవారం రాత్రి మృతి చెందాడు. సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో అనారోగ్యానికి గురైన విద్యార్థికి అక్కడి పీహెచ్‌సీలో వైద్యం చేయించకుండా హెచ్‌ఎం, వార్డెన్ ఎటువంటి వైద్య సదుపాయాలు లేని మారుమూల స్వగ్రామానికి తరలించారని తల్లిదండ్రులు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే..

జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని ఎం.బూసుకొండ గ్రామానికి చెందిన జర్తా శంకరరావు, కాసులమ్మ దంపతుల కుమారుడు శ్యామ్యూల్ (13) సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శ్యామ్యూల్‌కు కడుపునొప్పి రావడంతో పాఠశాల సిబ్బంది విద్యార్థికి పీహెచ్‌సీలో వైద్య సేవలను అందించకుండా వారి స్వగ్రామమైన ఎం.బూసుకొండకు నాలుగు రోజుల క్రితం పంపించేశారు. సోమవారం రాత్రి సమయంలో శ్యామ్యూల్‌కు ... మిగతా 8వ పేజీలో

విద్యార్థుల హాజరు తగ్గితే టీచర్లపై చర్యలు

- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు హెచ్చరిక
- విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించిన డీఈవో
- పక్కా ప్రణాళికతో చదువుకోవాలని విద్యార్థులకు సూచన



పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

పెదబయలు, జూలై 30: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తగ్గితే సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి హాజరు తగ్గడంపై హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతిలోకి వెళ్లి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. గణితంపై మెలకులను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి విద్యార్థి రోజూ పాఠశాలకు రావాలని, ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో సబ్జెక్టుల వారీగా చదువుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో డీఈవో బ్రహ్మాజీరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సబ్జెక్టుల వారీగా బోధన జరగాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ కళాశాలను తనిఖీ చేసి విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని ప్రిన్సిపాల్ చెప్పడంతో అర్హులైన స్థానికులకు గెస్ట్ లెక్చరర్స్‌గా నియమించాలని ఎంఈవో కృష్ణమూర్తిని ఆదేశించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల-1ను సందర్శించి, విద్యార్థుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట ఎంఈవో-2 పుష్ప జోసెఫ్, ముంచంగిపుట్టు ఎంఈవో కె.కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు సతీశ్, నాగేశ్వరరావు, రవి, చక్రి తదితరులు ఉన్నారు.

జి.మాడుగుల ఎంపీపీ రాజీనామా

- ముగిసిన రెండున్నరేళ్లు ఒప్పందం
- జడ్పీ సీఈవోకి రాజీనామా పత్రం అందజేసిన ఎంపీపీ పద్మ

జి.మాడుగుల, జూలై 30:

జి.మాడుగుల ఎంపీపీ పద్మ రాజీనామా చేసింది. రెండున్నరేళ్ల ఒప్పందం మేరకు ఆమె రాజీనామా పత్రాన్ని జిల్లాపరిషత్ సీఈవో పోలినాయుడుకు మంగళవారం అందజేశారు. వివరాల్లోకి వెళితే..

మండలంలో 15 మండల ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ స్థానాలు) ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ఏడు స్థానాలు, టీడీపీకి ఏడు స్థానాలు వచ్చాయి. ఒక స్థానంలో స్వతంత్ర్య అభ్యర్థి పద్మ విజయం సాధించింది. రెండు పార్టీలకు సరైన మెజారిటీ దక్కకపోవడంతో ... మిగతా 8వ పేజీలో



జడ్పీ సీఈవో పోలినాయుడికి రాజీనామా పత్రం అందజేస్తున్న ఎంపీపీ పద్మ

క్రైం... crime news

పాము కాటుకు గిరిజనుడి మృతి


రాజారావు (ఫైల్)

జి.మాడుగుల, జూలై 30: మండలంలోని గెమ్మెలి పంచాయతీ పొత్తడిగొంది గ్రామానికి చెందిన జన్ని రాజారావు (40) పాముకాటుకు గురై సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాజారావు పొలం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చాడు. పొయ్యిలో కట్టెలు కోసం ఇంటి వెనుకల భాగంలో వెళ్లగా అక్కడ నాగు పాము కాటు వేసింది. ఇది చూసిన పక్కింటి వారు కుటుంబీకులకు సమాచారం అందించారు. హుటాహుటిన గెమ్మెలి పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

చిట్ నిర్వాహకుడిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 30: చీటీ డబ్బులు చెల్లించని నిర్వాహకుడిపై సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన కాంతారావు అనే వ్యక్తి లక్ష్మీగణపతి లక్కీస్కీమ్ పేరుతో చీటీలు వేశారన్నారు. కుంచావారివీధికి చెందిన వి.మల్లికార్జునరావు తన ఇద్దరు పిల్లలు తరఫున 2022 అక్టోబరు నుంచి ఒక్కొక్కరి పేరును నెలకు రూ. 1500లు చొప్పున 33 నెలలు చీటీ కట్టారన్నారు. సమయం మించిపోయినా తనకు రావాల్సిన రూ.లక్షా 20 వేలు చెల్లించలేదని నిర్వాహకుడు కాంతారావుపై బాధితుడు మల్లికార్జునరావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, జూలై 30: ఉద్యోగం ఇప్పిస్తానని రూ.మూడు లక్షలు తీసుకుని తనను మోసం చేశాడంటూ విశాఖకు చెందిన సన్యాచారిపై తుమ్మపాలకు చెందిన కోనా వరహా నరసింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ మహ్మద్ ఆలీ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తుమ్మపాలకు చెందిన నరసింహమూర్తి తన మేనల్లుడికి ఉద్యోగం కోసం 2021 మార్చి మూడో తేదీన విశాఖపట్నానికి చెందిన సన్యాచారికి రూ.3 లక్షలు ఇచ్చారు. అయితే ఇప్పటికి ఉద్యోగం ఇప్పించకపోగా, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆలీ తెలిపారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, జూలై 30: స్థానిక రింగురోడ్డులో ఓ వ్యక్తి నుంచి సోమవారం రాత్రి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మునగపాకకు చెందిన దొడ్డి వెంకటరమణ పట్టణంలోని మద్యం దుకాణంలో పది మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళుతుండగా అనుమానం వచ్చి రింగు రోడ్డు జంక్షన్ వద్ద తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని, ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఎలుకల మందు పిచికారీ చేసిన చేతితో ఆహార పదార్థాలు తిన్న యువకుడి మృతి

కొత్తూరు, జూలై 30 : ఎలుకల మందు పిచికారీ చేసిన చేతితో ఆహారపదార్థాలు తిన్న యువకుడు విశాఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి మండలం సీతానగరం గ్రామానికి చెందిన గంగుపాం దిలీప్‌కుమార్ (28) తన నివాసంలో ఉన్న ధాన్యం తినేస్తున్నాయని సోమవారం రాత్రి ఎలుకల నివారణ మందు చేతితో కలిపి పెట్టాడు. అయితే అదే చేతితో ఆహార పదార్థాలు తినడంతో దిలీప్‌కుమార్ అపస్మారక స్థితిలో పడిపోయాడన్నారు. దీంతో హుటాహుటీన అతనిని అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు అతని తండ్రి తాతారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తేజేశ్వరరావు చెప్పారు.

వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఏయూ

అధికారులకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశం


ఏయూలో పర్యటిస్తున్న ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏయూను వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ సూచించారు. మంగళవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన పాలకమండలి సమావేశ మందిరంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావుతోపాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్య శిక్షణను విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. వర్సిటీలోని ప్రతి విభాగం లో ఇండస్ట్రీ ల్యాబ్‌ను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న విభిన్నశాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రవేశాల ప్రక్రియ, వార్షిక క్యాలెండర్, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన, విభాగాలు, ప్రాజెక్టులు, సీఈవోల పనితీరును పరిశీలించడానికి తాను వచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలను దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాల ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి లోకేశ్ ఆలోచన చేస్తున్నారని వివరించారు. దేశంలో తొలి 50 స్థానాల్లో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉండేలా ప్రణాళికాయుతంగా పనిచేస్తామన్నారు. సమాజంలో ఉన్న అవకాశాలను యువతకు వివరించాలని, విశాఖలో ఉన్న వివిధ ఇంక్యుబేషన్ కేంద్రాలు, ఎస్‌టీపీఐ సంస్థలతో పరిశోధకులను అనుసంధానం చేయాలని సూచించారు. ఏయూను మోడల్‌గా తయారుచేస్తే దాన్ని రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాయాల్లో అమలు చేస్తా మని స్పష్టంచేశారు. పేపర్ లెస్‌వర్సిటీగా ఏయూను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరిదేవి, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.అంతకుముందు ఏయూ మెరైన్ లివింగ్ రీసోర్సెస్ సెంటర్‌లో అవంతి స్కిల్ ట్రెనింగ్ సెంటర్‌ను సౌరబ్ గౌర్ సందర్శించారు.

గత వీసీ హయాంలో అవకతవకలపై చర్యలు

అనంతరం మీడియాతో మాట్లాడిన సౌరబ్ గౌర్ గత వీసీ హయాంలో జరిగిన అవకతవకలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని, వీటిపై చర్యలు తీసుకుంటామన్నారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాన్ని ప్రాధాన్యత అంశంగా పెట్టుకున్నట్టు వివరించారు. రెగ్యులర్ వైస్‌చాన్సలర్ల నియామకానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు వివరించారు. ఏయూను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఏయూలో 58 విభాగాలు, పది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గత వీసీ అక్రమాలు, అన్యాయాలపై పలువురు ఫిర్యాదులు చేశారు.

ఫిర్యాదు చేసిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్

ఏయూ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో సౌరబ్ గౌర్‌ను కలిసిన పలువురు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. కృష్ణా యూనివర్సిటీ నుంచి, ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలని కోరారు. అనైతికంగా, అడ్డగోలుగా జగన్మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన బదిలీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యాపకులు, స్కాలర్స్ సంతకాలతో ఫిర్యాదును చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	82.00
లైవ్ ధర	102.00
విత్ స్కిన్	174.00
స్కిన్ లెస్	184.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

భలే రుచి బేంబూ షూట్స్

ఒకసారి తింటే.. మళ్లీ రుచి చూస్తారు

- ఎగబడి కొంటున్న వినియోగదారులు
- వెదురు కొమ్ములులో పోషక విలువలెక్కువ


లంబసింగి ఘాట్‌లో విక్రయిస్తున్న వెదురు కొమ్ములు


వెదురు కొమ్ములు స్నాక్స్

చింతపల్లి, జూలై 30: జిల్లాలో వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆదివాసీల అతి ప్రియమైన ఆహారంలో ఒకటైన వెదురుకొమ్ములు మార్కెట్‌లోకి వచ్చేశాయి. వాటిని వినియోగదారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. పూర్వం నుంచి గిరిజనులు సంప్రదాయంగా వెదురు కొమ్ములను ఆహారంగా తీసుకుంటున్నారు. వర్షాకాలం ప్రారంభంలో అడవిలోని వెదురు మొక్కల వద్ద అధికంగా పిలకలు వస్తాయి. ఈ లేత వెదురు పిలకలను సేకరించి ఆదివాసీలు కూరగా చేసుకుని తింటారు. తొలి రోజుల్లో వెదురు కొమ్ములను ఆదివాసీలు మాత్రమే ఆహారంగా తీసుకునేవారు. కాలక్రమేణా అన్నివర్గాల ప్రజలు వెదురు కొమ్ములను ఆహారంగా తీసుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే వెదురు కొమ్ముల కూర మంచి రుచిగా ఉంటుంది. ఒకసారి ఈ కూర తిన్నవారు మరోసారి తినాల్సిందే. మైదాన ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడ విధులు నిర్వహించేందుకు వచ్చిన ఉద్యోగులు కొమ్ముల కూర ఇష్టపడి తింటారు. వెదురు కొమ్ముల కూర తాజాగా స్టార్ హోటళ్లలోనూ లభిస్తుంది. చైనా, వియత్నం దేశాల్లోనూ వెదురు కొమ్ములను కూరగా, స్నాక్స్‌గా తీసుకుంటున్నారు. వెదురు కొమ్ములను ఆంగ్లంలో బేంబూ షూట్స్ అని పిలుస్తారు.


వెదురు కొమ్ములు

ఎగబడి కొంటున్న వినియోగదారులు

వెదురు కొమ్ములు (బేంబూ షూట్స్)ని వినియోగదారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం లంబసింగి ఘాట్‌లో ఆదివాసీలు వెదురు కొమ్ములను విక్రయిస్తున్నారు. ఒక వాటా(ఐదు కొమ్ములు) రూ.50 ధరకు విక్రయిస్తున్నారు. ఈ కొమ్ములను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పోటీ పడుతున్నారు. లంబసింగి ఘాట్ వద్ద గిరిజనులు ఏర్పాటు చేసిన దుకాణాల్లో ఒక్కొక్కరు ప్రతి రోజు రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల కొమ్ములు విక్రయిస్తున్నామని చెబుతున్నారు.

అత్యధిక పోషక విలువలు



వెదురు కొమ్ములు(బేంబూ షూట్స్) అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహారం. ఉడికించిన వెదురు కొమ్ములు 155గ్రాముల నుంచి 64 కేలరీలు శక్తి, 2.5గ్రాముల ప్రొటీన్, 4.5 గ్రాములు ఫ్యాట్, 2గ్రాములు ఫైబర్, విటమిన్ బి6 14 శాతం, ఈ 9 శాతం, కె 3 శాతం, రిబోఫ్లేవిన్ 3 శాతం, థైమిన్ 3శాతం, ఫాస్పరస్ 3శాతం, పొటాషియం 3శాతం, ఐరన్ 3శాతం లభిస్తుంది. పోషకాహార లోపం, రక్తహీనత కలిగిన వారితోపాటు గర్భిణులు, బాలింతలకు మంచి ఆహారం.

- వి.దివ్యసుధ, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త, బీసీటీ-కేవీకే హరిపురం

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి జల్లులు

- ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి టౌన్, జూలై 30: రాగల ఐదు రోజుల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని, అలాగే ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 25.0 నుంచి 26.0 డిగ్రీ సెల్సియస్ ఉండవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీహెచ్. ముకుందరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాగల ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నారుమడి నాటుకోవడానికి సిద్ధంగా ఉంటే ఈ వర్షాలను ఉపయోగించుకుని పచ్చిరొట్ట పైరును నేలలో కలియ దున్ని, ప్రధాన పొలం తయారు చేసుకొని నాట్లు వేసుకోవాలని తెలిపారు. వర్షాల వల్ల వేరుశనగ పైరులో కలుపు సమస్య అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ భవాని, డాక్టర్ సీహెచ్ రామలక్ష్మి, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ పీవీ పద్మావతి, డాక్టర్ ఎ.అలివేణి పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో వసతులపై ఆరా

- ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

ఎలమంచిలి, జూలై 30: స్థానిక తులసీనగర్‌లోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో వెంకట లక్ష్మమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఇదే పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్లస్-2 విద్యార్థినుల తరగతి గదులను పరిశీలించి వారితో మాట్లాడారు. ఇంగ్లీషు సబ్జెక్టు బోధన సంతృప్తికరంగా లేదని డీఈవోకు విద్యార్థినులు తెలిపారు. ఉచిత పుస్తకాలు అందలేదని విద్యార్థినులు తెలపడంతో వెంటనే పంపిణీ చేయాలని ఎంఈవో 2 అరుణ్‌కుమార్‌ను ఆదేశించారు. స్కూల్ ఆవరణలో మధ్యాహ్న భోజన పథకం వంటలను కట్టెల పొయ్యిలపై వండుతుండడాన్ని పరిశీలించి ఇది నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. అసంతృప్తిగా మధ్య భవన నిర్మాణాలను పరిశీలించి వాటిని వేగంగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవోలు మీనాక్షి, అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు వున్నారు.

'ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ డిమాండ్లను నెరవేర్చాలి'


మాట్లాడుతున్న వీవీకే రాయ్

తుమ్మపాల, జూలై 30 : ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో రిటైర్డు ఎంప్లాయీస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్‌కు మినిమం రూ.తొమ్మిది వేలు పింఛన్‌ను అందజేయాలన్నారు. అలాగే డీఏ, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రిటైర్డు ఎంప్లాయీస్‌కు న్యాయం చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 20న విశాఖలోని పీఎఫ్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏవీ రావు, సీహెచ్ పైడిరాజు, రాజానదొరబాబు, సత్యవతి, టీఎం దొర, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పీహెచ్‌సీ పనులపై కౌన్సిలర్ పద్మావతి అసంతృప్తి

- కౌన్సిలర్లతో కలిసి ఆస్పత్రి సందర్శన
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


అర్బన్ పీహెచ్‌సీ సమస్యలను తెలుసుకుంటున్న చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, జూలై 30 : మునిసిపాలిటీలోని ఏడో వార్డు అలేటి జమ్మయ్య వీధిలో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ భవనం పనులు నాసిరకంగా ఉన్నాయని, అరకొర సౌకర్యాలతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని 26వ వార్డు కార్పొరేటర్ చింతకాయల పద్మావతి అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ' నిర్మాణంలో నాణ్యత లేని అర్బన్ పీహెచ్‌సీ' శీర్షికన వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. దీని మీద పద్మావతి కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తారు. తర్వాత మిగిలిన టీడీపీ కౌన్సిలర్‌లతో అర్బన్ పీహెచ్‌సీనిఇ సందర్శించారు. ఆస్పత్రిలో సమస్యలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మీటింగ్ హాలులోని బోరు పాయింట్, రక్త పరీక్షా కేంద్రం, పాడైన ఎంట్రన్స్ తలుపు, ఆస్పత్రి వెనక భాగంలో కుంగిన పునాదులను పరిశీలించారు. నీటి సదుపాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ మాట్లాడుతూ ఆస్పత్రిలోని కనీస సౌకర్యాలు లేవన్నారు. పనులు నాణ్యత లేవని, వార్డు అధ్వానంగా ఉందని విమర్శించారు. ఈ స్థలంలో కల్యాణ మండపం కట్టడానికి అయ్యన్నపాత్రుడు ప్లాన్ చేశారని తెలిపారు. ఇక్కడ ప్రజలు ఆస్పత్రి కట్టడాన్ని వ్యతిరేకించారని, వైసీపీ నాయకులు పోలీసులను అడ్డు పెట్టుకొని వైసీపీ బలవంతంగా నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. ఎక్సపరీ మందులు చాలా ఉన్నాయని, ఇక్కడ ఉపయోగ పడకపోతే ప్రాంతీయ ఆస్పత్రికైనా పంపితే ఉపయోగ పడేవన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రావాడ లక్ష్మి, డబ్బీరు శ్రీకాంత్, దనిమిరెడ్డి మధు, పెదిరెడ్ల దివ్య, పైల కాశీరత్నం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీ ఆత్మహత్య

ఆరిలోవ (విశాఖపట్నం), జూలై 30: పోక్సో కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం విశాఖ కేంద్ర కారాగారంలో జరిగింది. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు...విశాఖ జిల్లా ఆనందపురం మండలానికి చెందిన ఉప్పాడ గౌరీశంకర్ (21) 2020 అక్టోబరు 17న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి 20 ఏళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించారు. అతడిని ఈనెల 25న కేంద్ర కారాగారానికి పోలీసులు అప్పగించారు. జైలుకు వచ్చినప్పటి నుంచి దిగులుగా ఉండడంతో జైలు అధికారులు పలు దఫాలు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ శిక్ష పడిందనే మనస్తాపంతో గౌరీశంకర్ మంగళవారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌లో తన ప్యాంటుకు ఉన్న తాడుతో వెంటిలేటర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బకెట్ శబ్దం రావడంతో పక్క బాత్‌రూమ్‌లో ఉన్న ఖైదీ తలుపుకొట్టి చూడగా అప్పటికే కొన ఊపిరితో తాడుకు వేలాడుతున్నాడు. దీంతో జైలు అధికారులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచి, అతడి బంధువులకు, ఆర్డీవోకు సమాచారం ఇచ్చామని సూపరింటెండెంట్ వివరించారు. కాగా మృతుడు గతంలో లారీ క్లీనర్‌గా పనిచేసేవాడని, ఏడో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో శిక్ష అనుభవిస్తున్నాడని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వాడచీపురుపల్లి విద్యార్థి ఎంపిక


విద్యార్థి అభిరామ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం కనకేశ్వరరావు, తదితరులు

పరవాడ, జూలై 30: ఈ ఏడాది సెప్టెంబరు నెలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వాడచీపురుపల్లి హైస్కూల్‌కు చెందిన ఎస్. అభిరామ్ ఎంపికైనట్టు కోచ్ ఆంజనేయులు తెలిపారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో అభిరామ్ 14 నుంచి 16 సంవత్సరాల విభాగంలో కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు, పీడీ అన్నాజీరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభిరామ్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు.

జీవో నంబరు 85ను వెనక్కి తీసుకోవాలి

- డీసీహెచ్‌ఎస్, డీఎం అండ్ హెచ్‌వోలకు వైద్యుల వినతి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, జూలై 30: ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కోసం ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీవో నంబరు 85ను వెనక్కి తీసుకోవాలని కోరుతూ మంగళవారం డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్, డీఎం అండ్ హెచ్‌వో బాలాజీలను ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈస్టర్ రాణి, తిరుపతిరావు కోరారు. ఈ మేరకు వారికి వినతి పత్రాలు అందజేశారు. జీవోను వెనక్కి తీసుకుని ఇన్ సర్వీస్ కోటాను మునుపటి మాదిరిగానే ఉంచాలని, ఇది సాధించే వరకు తాము పోరాడతామని సంఘ ప్రతినిధులు కోరారు.

పెన్సిల్ ముల్లుపై ఒలింపిక్స్ లోగో

- సూక్ష్మ కళాకారుడు వెంకటేశ్ ప్రతిభ


గట్టెం వెంకటేశ్, సూక్ష్మ కళాకారుడు


పెన్సిల్ ముల్లుపై ఒలింపిక్ గేమ్స్ లోగో తయారు చేసిన దృశ్యం

నక్కపల్లి, జూలై 30: ప్రస్తుతం ప్రపంచాన్ని ఒలింపిక్స్ క్రీడలు ఉర్రూతలూగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని చినదొడ్డిగల్లుకి చెందిన సూక్ష్మ కళాకారుడు, గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్న గట్టెం వెంకటేశ్ పెన్సిల్ ముల్లుపై ఒలింపిక్స్ గేమ్ లోగో తయారు చేశారు. 6డీ పెన్సిల్ ముల్లుపై 2 గంటలు శ్రమించి, 6ఎంఎం పొడవు, 12 ఎంఎం వెడల్పున ఈ లోగో తయారుచేశారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు


మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ 2029 నాటికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తెలిపారు. మంగళవారం అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న వంద రోజుల్లో 1.25 లక్షల గృహాలు, ఏడాదిలో 8.25 లక్షల గృహనిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని సంజీవరెడ్డి నగర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో కేంద్ర పథకాల సహకారంతో మధ్యతరగతి, దిగువ తరగతి వర్గాలకు, జర్నలిస్టులకు సరసమైన దరలకు ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. త్వరలోనే సర్వే నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పీఎంఏవై 2.0 ప్రకారం కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేస్తామన్నారు.

పెండింగ్ కేసుల పురోగతిపై దృష్టి సారించండి

- సిబ్బందికి ఎస్పీ దీపిక ఆదేశం


వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

పరవాడ, జూలై 30: పెండింగ్ కేసుల పురోగతిపై దృష్టి సారించాలని సిబ్బందిని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. మంగళవారం ఆమె పరవాడ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో గల వాహనాలను ఏయే కేసుల్లో సీజ్ చేశారని, ఎందుకు స్టేషన్ ప్రాంగణంలో ఉన్నాయన్న విషయాలను సీఐ బాల సూర్యారావును అడిగి తెలుసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలకు ఆయా కేసుల వివరాలను ట్యాగ్ చేయాలన్నారు. జాతీయ రహదారిలో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఎస్పీ వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

2న జాబ్‌మేళా

విశాఖపట్నం,జూలై 30: కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆగస్టు 2వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అమర్ రాజా గ్రూప్, సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ గ్రూప్, అపోలా ఫార్మసీ, శ్రీరాం చిట్స్ తదితర సంస్థలు పాల్గొననున్నాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ తదితర కోర్సులు చేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చు. ఆసక్తి గల వారు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరీయర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు.


జలపాతం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న సీఐ, ఎస్‌ఐలు

గాదిగుమ్మి జలపాతం వద్ద హెచ్చరిక బోర్డు

కొయ్యూరు, జూలై 30: మండలంలోని కినపర్తి పంచాయతీ వలసంపేట సమీప గాదిగుమ్మి జలపాతం అందాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు జలపాతం వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డును మంగళవారం వారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐ మాట్లాడుతూ జలపాతం అందాలను తిలకించేందుకు తరలి వచ్చే పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా కుటుంబ సభ్యులతో గడిపి వెళ్లాలి తప్పితే ఎట్టి పరిస్థితుల్లోనూ స్నానానికి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలకు నిరసనగా ర్యాలీ


ఘాట్ రోడ్డులో ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

జి.మాడుగుల, జూలై 30: మావోయిస్టులు పిలుపునిచ్చిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలకు వ్యతిరేకంగా బుధవారం విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎవరి కోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నారని? ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. అలాగే విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, సెల్‌టవర్‌లు తదితర అభివృద్ధికి మావోయిస్టులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారని ఇన్‌ఫార్మర్ల నెపంతో గిరిజనులకు హత్యలు సరికాదని ఎద్దేవా చేశారు. ఈ ర్యాలీ సంతబయలు వరకు చేపట్టారు.

వర్షాలతో నష్టపోయిన బాధితులకు నిత్యావసర సరకులు

చింతపల్లి, జూలై 30: మండలంలోని చిన్నగెడ్డ గ్రామంలో వర్షాల వల్ల గృహాలను నష్టపోయిన బాధితులకు నిత్యావసర సరకులు అందజేసినట్టు టీడీపీ నాయకుడు రీమల ఆనందరావు తెలిపారు. మంగళవారం చిన్నగెడ్డ గ్రామంలో బాధిత గిరిజన కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, పప్పు, నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత నిధులతో వర్షాల బాధితులకు సహాయం చేయాలని నిత్యావసర సరకులు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సిందాడ చిన్న, అనిల్, ముత్యాలు, జనసేన నేత కిముడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తుఫాన్ నష్టాలపై అంచనా వేయాలి

జి.మాడుగుల, జూలై 30: తుఫాన్ తాకిడి నష్టాలపై అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు కోరారు. పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాలు, ఇళ్లకు అధికంగా నష్టాలు వాటిల్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.పిన్నయ్య దొర, కె.చిన్నకొండబాబు, పి.రామయ్య, ఎస్.కొండలరావు, చిన్న, సన్యాసిరాజు, సోమన్నదొర, అప్పారావు లకే రామకృష్ణ, కె.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన మొక్కల పంపిణీ

చింతపల్లి, జూలై 30: ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రైతులకు ఉచితంగా ఉద్యాన పంటల మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు ఎంపీపీ కోరాబు అనుషదేవి చెప్పారు. తాజంగి కోరుకొండ గ్రామంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి మొక్కలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. ప్రధానంగా గిరిజన రైతుల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా అవకాడో, డ్రాగన్‌ఫ్రూట్, సపోట, తీపి నారింజ, సీతాఫలం, నిమ్మ, జీడిమామిడి, మునగ, జాఫ్రా మొక్కలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీవో వీరసాయిబాబు మాట్లాడుతూ మండలంలో ఉద్యాన పంటల సాగుకు 1927 మంది రైతులను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, కూటమి నాయకులు లక్ష్మణ్, వంతల బుజ్జిబాబు, సాగిన బాలక్రిష్ణ, స్థానిక సర్పంచ్ మహేశ్వరి పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగు ధ్రువపత్రాలు

చింతపల్లి, జూలై 30: కౌలు రైతులకు సాగు ధ్రువపత్రాలు అందజేస్తున్నట్టు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కంటా జాహ్నవి చెప్పారు. మంగళవారం లంబసింగి, తాజంగి పంచాయతీల్లో ఏడీఏ పర్యటించారు. లంబసింగి గ్రామంలో వ్యవసాయ అధికారులు కౌలు రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాజంగిలో రైతులతో కలిసి వరుసల పద్ధతిలో ఆమె వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు వల్ల బ్యాంకలో పంట రుణం పొందవచ్చునన్నారు. పంట బీమాను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటను నష్టపోతే పరిహారం పొందవచ్చునన్నారు. అలాగే రైతులు వరుసలు పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల అధిక దిగుబడులు పొందచ్చునన్నారు. రైతులు ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. కౌలు రైతులు, సాధారణ రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియం చెల్లించి ఈ పథకంలో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, వీఆర్వో భారత పాల్గొన్నారు.

పథకాలకు మహనీయుల పేర్లపై హర్షం

జి.మాడుగుల, జూలై 30: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మహనీయులు పేర్లు పొందుపరచడంపై టీఎన్‌ఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకులు వనుగు త్రినాథ్, కొండపల్లి నితిన్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో డొక్క సీతమ్మ, సర్వేపల్లి రాధకృష్ణ, ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనేతల పేర్లు పెట్టి, వారికి గౌరవం ఇవ్వడం గొప్ప విషయమని నాయకులు తెలిపారు.

అరకును వీడిన ముసురు

అరకులోయ, జూలై 30: మండలాన్ని 20 రోజులుగా పీడించిన ముసురు వదిలేసింది. పరిసర ప్రాంతాలన్నీ ముసురు వాతావరణంలో ఉండడంతో జన జీవనానికి తీవ్ర ఆటంకం ఏర్పడగా, సోమవారం నుంచి తగ్గుముఖం పట్టడంతో జనం కాస్త ఉపశమనం పొందారు. తుఫాన్ ప్రభావం వల్ల ముసురు వాతావరణం ఏర్పడడంతో పాటు వర్షాలు భారీగా పడడంతో పంట పొలాలు నీట మునిగాయి. లోలెవెల్ వంతెనలు, కాజ్‌వేలు దెబ్బతిన్నాయి. రహదారులు వర్షం నీటికి కోతకు గురయ్యాయి. వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టం అంచనా వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. ఇంజనీరింగ్ అధికారులు కోతకు గురైన రహదారులు, దెబ్బతిన్న వంతెనలు గుర్తించి, వాటి మరమ్మతులకు అవసరమయ్యే నిధులు సమకూర్చేందుకు తగిన అంచనాలు సిద్ధం చేస్తున్నారు.

గిరి రైతులు చిరుధాన్యాల సాగులో పరిపుష్టి సాధించాలి

ఐటీడీఏ పీవో వి.అభిషేక్




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్... రైతులకు పరికరాలు అందిస్తున్న పీవో

పాడేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు చిరుధాన్యాల సాగులో పరిపుష్టి సాధించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. స్థానిక ఏరువాక కేంద్రంలో ముంచంగిపుట్టు, అరకులోయ, పాడేరు, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలాల అభ్యుదయ రైతులకు చిరుధాన్యాలు, నూనెగింజల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.అప్పలస్వామి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు నూనె గింజలు, చిరుధాన్యాలను మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగా సాగు చేయాలన్నారు. అలాగే శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి పట్టణాలకు తరలించే స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. గిరిజన రైతులు ఆధునిక వ్యసాయ పద్ధతులు అవలంబించాలని, తెగుళ్ల నివారణకు అధికారులు సూచించిన సలహాలు పాటించాలని సూచించారు.

అనంతరం రైతులకు ఐటీడీఏ పీవో అభిషేక్ చేతుల మీదుగా వ్యసాయ ఉపకరణాలు, బ్యాటరీ స్ప్రేయర్లు, నూనె యంత్రాలు, వలిసెల సాగులో పరాన్న జీవలను వేరుచేసే జల్లెడలు, టార్పాలిన్లు, కొడవళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన వనాధికారి కుమార్‌రావు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పా రావు, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ తేజేశ్వరరావు, పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి

గిరిజన విద్యార్థులు కెరీర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలని ఐటీడీఏ పీవో అభిషేక్ చెప్పారు. గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, దిగువ మోదాపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సూపర్ 50 పేరిట పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధనా విధానాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించి, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రవేశం పొందాలని ఆయన సూచించారు. ఇంటర్మీడియట్ తరువాత ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, నీట్, ఎంసెట్ పరీక్షలపై అవగాహన కల్పించారు. గిరిజన విద్యార్థులు సివిల్స్‌లో సైతం విజేతలు కావాలని ఆకాంక్షిస్తారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మత్స్యలింగం

ఎస్‌ఐపై చర్యలకు ఏకగ్రీవంగా తీర్మానం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం... హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

హుకుంపేట, జూలై 30: మండల అభివృద్ధి కోసం అధికారులు, నాయకులు కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తూఫాన్ వల్ల ప్రతీ గ్రామంలో భారీగా నష్టాలు జరిగాయని, అధికారులు సర్వేలు నిర్వహించి ప్రజలకు పరిహారం అందే విధంగా చూడాలని కోరారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను గుర్తించి, వాటి మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. గతంలోని పెండింగ్ బిల్లు ఉంటే వెంటనే విడుదల చేయాలన్నారు. విద్య, ఆరోగ్య శాఖల అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు.

కాగా, సమస్యలపై పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. కాగా, ప్రజా ప్రతినిధులపై దురుసుగా వ్యవహరిస్తున్న ఎస్‌ఐ సతీష్‌పై చర్యలు తీసుకోవాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటరావు, ఇంజనీరింగ్ అధికారులు రమేష్‌బాబు, సంజీవరావు, గౌరీశంకర్, ప్రజా ప్రతినిధులు మహేశ్వరావు, బి.వెంకటరమణ, సుశీల, బొంజుబాబు, రమేష్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు


కిలగాడలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఈవో బ్రహ్మజీరావు

నాణ్యమైన విద్యనందించాలి: డీఈవో

ముంచంగిపుట్టు, జూలై 30: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అల్లూరి జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈవో) పి.బ్రహ్మజీరావు సూచించారు. మండలంలోని కిలగాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల పుస్తకాలను, పిల్లల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం మెరుగుపడేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించిన ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ నుంచి కిలగాడ కేజీబీవీ పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశాల బోధించే తీరును పరిశీలించారు. వారికి తగిన సలహాలు, సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎంపీపీ రాజీనామా

... 5వ పేజీ తరువాయి

గడుతూరు సెగ్మెంటు నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా విజయం సాధించిన కొర్రా పద్మ టీడీపీ మద్దతుతో ఎంపీపీ అయ్యింది. ఆ సమయంలో రెండున్నరేళ్ల పాటు పద్మ ఎంపీపీగాను, మరో రెండున్నరేళ్ల బొయితిలి ఎంపీటీసీ సభ్యుడు లొంబోరి అప్పలరాజు ఎంపీపీగా కొనసాగేందుకు ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు రెండున్నరేళ్ల ముగియడంతో టీడీపీ నేతల సూచన మేరకు మంగళవారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాపరిషత్ కార్యాలయంలో సీఈవో పోలినాయుడికి పద్మ రాజీనామా పత్రాన్ని అందజేసింది.

ప్రతీ వరద బాధితుడికి సాయం అందాలి

... 5వ పేజీ తరువాయి

చిన్నార్‌కూరులో విద్యుత్ సమస్య, చిన్నార్‌కూరు నుంచి బొదుకూరు వరకు రోడ్డు నిర్మాణంపై స్థానికులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. తమ గ్రామానికి పోలవరం ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీని అందించాలని పెర్కూరు వాసులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏఎస్‌పీ రాహుల్ మీనా, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయంపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

జిల్లాలో రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో వరద బాధితులకు ప్రభుత్వ ఆర్థిక సాయం, బియ్యం పంపిణీపై జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం రాత్రి రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సాయం పంపిణీలో ఎటువంటి అపోహలకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పొరపాట్లు జరిగితే అందుకు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వరదలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, అందుకు సంబంధించి వైద్యారోగ్య శాఖ, సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు.

ఆగస్టు ఒకటినే పెన్షన్ల పంపిణీ పూర్తికావాలి

జిల్లాలో ఆగస్టు ఒకటే తేదీ నాడే సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీపై జిల్లాలోని అధికారులతో మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.

తొలి రోజు శత శాతం పెన్షన్ల పంపిణీ జరిగే విధంగా డీఆర్‌డీఏ అధికారులు, ఎంపీడీవోలు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఒకటీ అర పెన్షన్లు తొలి రోజు మిగిలితే రెండో రోజు విధిగా లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు.

సప్పర్ల ఆశ్రమ విద్యార్థి మృతి

... 5వ పేజీ తరువాయి

తీవ్రమైన కడుపునొప్పితో పాటు వాంతులు, విరోచనాలు అధికం అయ్యాయి. ఆ సమయంలో జోరున వర్షం, మరోపక్క రహదారి సౌకర్యం కూడా లేకపోవడంతో ఆసుపత్రికి కూడా తరలించే అవకాశం లేకుండా పోయింది. దీంతో శ్యామ్యూల్ పరిస్థితి విషమించి రాత్రి ఒంటి గంట సమయంలో మృతి చెందాడు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

తమ కుమారుడు అనారోగ్యం బారిన పడితే పాఠశాలలోనే ఉంచి వైద్యం అందించకుండా ఎటువంటి వైద్య సౌకర్యాలు లేని మారుమూల గ్రామానికి పంపించిన పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

నలుగురికి ఒకరు..

- గంజాయి సరఫరాలో లెక్కలు... వెలుగులోకి వస్తున్న 'వాసన'
- 17 మందిని అదుపులోకి తీసుకున్న యాంటీ నార్కోటిక్ సెల్
- విశాఖకు చెందిన ఇద్దరు కీలక సరఫరాదారుల అరెస్టు
- 46 కిలోల గంజాయి స్వాధీనం... నిందితుల్లో ఇద్దరు మైనర్లు


గంజాయి బస్తాలు, నిందితులతో పోలీసు కమిషనర్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఇద్దరూ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. గ్రామంలో కూలీ పనులకు వెళ్తుండేవారు. ఇద్దరిలో ఒకరు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ ఒక రెస్టారెంట్‌లో పనిచేస్తూ అప్పుడప్పుడు ఇంటికి వస్తుండేవాడు. ఇంట్లో వారికి ఎంతోకొంత డబ్బులు ఇచ్చి వెళ్తుండేవాడు. మరొకరు గ్రామంలోనే కూలీ పని చేస్తుండేవాడు. అతడి ఖర్చులు మాత్రం సంపాదించిన దానికి సంబంధం లేకుండా ఉండేవి. ఈ ఇద్దరూ సంపాదిస్తున్న డబ్బులన్నీ కాయకష్టం మీద అనుకుంటే పొరపాటే. ఉపాధి ముసుగులో గంజాయిని సరఫరా చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఇద్దరూ చెరొక ప్రాంతంలో పనిచేస్తున్నా వారు సరఫరా చేస్తున్న గంజాయి మొత్తం విజయవాడ కేంద్రంగానే ఉంటోంది. ఇలా గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు కీలక వ్యక్తులతోపాటు కొనుగోలు చేసిన 17 మంది విజయవాడ యాంటీ నార్కోటిక్ సెల్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. వారి నుంచి మొత్తం 46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించిన వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, తూర్పు డీసీపీ గౌతమి శాలీ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఆర్.శ్రీహరిబాబు, ఇన్‌స్పెక్టర్లు ఐవీ నాగేంద్ర, ఎస్.రమేష్, శ్రీధరకుమార్, నాగశ్రీనివాస్‌తో కలిసి మంగళవారం వెల్లడించారు.

ఆదాయాన్ని బట్టి టీం

విశాఖపట్నం జిల్లా కొయ్యూరుకు చెందిన పోలేజి సాయి, కాకాని దేవరాజు అలియాస్ పండు ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. తర్వాత విద్యాభ్యాసం మానేశారు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటుండేవారు. ఈక్రమంలోనే గంజాయిని రుచి మరిగారు. దీనిపై ఆదాయాన్ని రుచి చూసిన ఇద్దరూ సరఫరాదారులుగా ఎదిగారు. కొన్ని సంవత్సరాలు కొయ్యూరు కేంద్రంగా గంజాయిని సరఫరా చేస్తున్నా సాయి ఏనాడూ పోలీసులకు చిక్కలేదు. జిల్లా సరిహద్దులు దాటి గంజాయిని సరఫరా చేయడం మొదలుపెట్టిన వారు విజయవాడలో శాశ్వత ఖాతాలను ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కరు నలుగురు నుంచి ఆరుగురి వరకు ఖాతాదారులుగా మార్చుకున్నారు. సాయి కొద్దిరోజుల క్రితమే ఉపాధి పేరుతో హైదరాబాద్‌కు మారాడు. అక్కడ ఒక రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. దేవరాజు మాత్రం కొయ్యూరులోనే వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. ఈ ఇద్దరూ కలిసి విజయవాడలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఖాతాదారులను ఏర్పాటు చేసుకున్నారు. వాళ్లంతా ఈ గంజాయిని బస్సులు, రైళ్లు, మోటారు సైకిళ్లపై ఇక్కడికి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. సాయి, దేవరాజు నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్న వారిలో మైనర్లు, రౌడీషీటర్లు ఉన్నారు. విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన మల్లపోగు శివనాగ మహేష్‌పై సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అతడితోపాటు సత్యనారాయణపురానికి చెందిన ధూళి వెంకటేష్, అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన జజ్జనం నరేష్ అలియాస్ మెకానిక్ నరేష్, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన దిన్నకుర్తి వెంకంరాజా అలియాస్ నాని, విజయవాడ క్రీస్తురాజపురానికి చెందిన శీలం చరణ్‌లు సాయి నుంచి దఫదఫాలుగా గంజాయిని కొనుగోలు చేశారు. ఈ ఐదుగురిపై గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వారిని విచారిస్తున్న సమయంలో సరఫరాదారుడు సాయి పేరు వెలుగులోకి వచ్చింది. దీనితో అతడి పేరును కసులో చేర్చారు. కాకాని దేవరాజు అలియాస్ పండు మాత్రం కొయ్యూరులో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం 300 కిలోల గంజాయిని విక్రయిస్తూ కొయ్యూరు పోలీసులకు చిక్కాడు. గంజాయిపై ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండడంతో ఆ పని మాత్రం మానలేదు. కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన కొమ్మూరు సాయికిరణ్‌పై పటమట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అతడితోపాటు వానం అరవింద్ అలియాస్ ఆర్వీ, సయ్యద్ అలీం అలియాస్ అలీ, కోట నాగదుర్గాప్రసాద్, మండవల్లికి చెందిన కమ్మగంటి నిఖిల్, ఓ మైనర్ కలిసి పండు నుంచి గంజాయిని కొనుగోలు కొన్నాళ్లుగా చేస్తున్నారు. వారిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. వారు కాకుండా కొత్తపేటకు చెందిన పిల్లా సాయికుమార్ అలియాస్ కలుపుకొట్టు నానిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన కుంటముల్ పవన్ కల్యాణ్, చిట్టినగర్‌కు చెందిన ఒక మైనర్‌పై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురు సాయి, పండు నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్టు తేలింది. ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు కిలోల గంజాయిని కొనుగోలు చేసి విజయవాడకు తీసుకొచ్చేవారు. ఈ గంజాయిని వ్యసనపరులకు విక్రయించేవారు. మొత్తం ఈ 17 మందిని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు.

సంక్షిప్తంగా..

రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, జూలై 30: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఆగస్టు నాలుగో తేదీ వరకు కనిష్ఠంగా 23 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 46 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావచ్చని చెప్పారు. తేమ, మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందన్నారు. వర్షాల వల్ల పంటల్లో తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని, వర్షాలు తగ్గిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

పాడేరు రూరల్, జూలై 30: ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎంఎల్ఎస్ఏ మెంబర్, న్యాయవాది తమర్బ ప్రసాద్ నాయుడు సూచించారు. స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల్ కోర్టు జడ్జి జి.స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం పాడేరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల్లో హ్యూమన్ ట్రాఫికింగ్, హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలను వివరించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించడంతో పాటు వాహనానికి సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్ అనేది చట్టరీత్యా నేరమని వివరించారు. యువత మంచి మార్గంలో నడిచేందుకు ఈ సదస్సులు దోహదపడతాయన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రథమ శ్రేణి జుడీషియల్ కోర్టు సిబ్బంది, అధ్యాపకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ర్యాలీ

పాడేరు రూరల్, జూలై 30: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అక్రమ అరెస్టు ఇంకెన్నాళ్లు అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సొనాయి గంగరాజు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పాడేరులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడ్ని కాపాడేందుకే కేజ్రీవాల్‌ను ఈ కేసులో అక్రమంగా ఇరికించారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ సాగెని మత్స్యకొండమ్మ, కుడుముల వెంకటరత్నం, స్వస్తి కీర్తి, సర్మండ చిట్టమ్మ, సొనాయి కాసులమ్మ, కె.లక్ష్మి, కె.సంగీత, ఎం.మణి పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కొయ్యూరు, జూన్ 30: పింఛన్ పంపిణీ చేసేందుకు ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సీతయ్య హెచ్చరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి వీలుగా నగదును బ్యాంకు నుంచి (విత్‌డ్రా) తీసుకునేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సిబ్బందికి ముందు రోజు పింఛన్ల మొత్తం అందించాలని, 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. అలాగే పింఛను దారులకు సమాచారం ఇచ్చి ఇంటి వద్ద ఉండేలా చూసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

దివ్యాంగ పిల్లల వివరాలు సేకరించండి

జి.మాడుగుల, జూలై 30: దివ్యాంగ పిల్లల వివరాలు సేకరించాలని జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ భాస్కర్‌రావు ఆదేశించారు. ఇక్కడి భవిత కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రంలో చేర్పించే చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఐఈఆర్‌పీ కె.రాజు, సిబ్బంది సరోజిని ఉన్నారు.

'వర్షాలతో బాలరేవుల వరకే ఏడు కేంద్రాల సరకులు'

కొయ్యూరు, జూలై 30: కొయ్యూరు ఐసీడీఎస్ పరిధిలోని రహదారి సౌకర్యం లేని ఏడు కేంద్రాలకు సమీప కేంద్రమైన బాలరేవులలోనే ప్రభుత్వం సరఫరా చేస్తున్న స్టాక్ దించి వేస్తున్నట్టు ఆయా కేంద్రాల పనితీరు పర్యవేక్షించే సూపర్‌వైజర్ ఎస్.కొండమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 'సరకుల తరలింపునకు అంగన్‌వాడీల అవస్థలు' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సూపర్‌వైజర్ స్పందించారు. జూన్, జూలై నెలల్లో వర్షాల కారణంగా రహదారి సౌకర్యంలేని చీడిపల్లి, గొంధుమలంక, తదితర మరో ఐదు సెంటర్లకు బాలరేవులలోనే స్టాక్ దించినట్టు చెప్పారు. అంతకు ముందు ఈ సెంటర్లుకు సంబంధించిన స్టాక్ చీడిపల్లి సెంటరు వరకు చేర్చేవారమని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ పరిస్థితి నెలకొందని చెప్పారు. వర్షాలు తగ్గితే తిరిగి చీడిపల్లికి స్టాక్ చేర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు

చింతపల్లి, జూలై 30: లైసెన్సు లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని పలు దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది వ్యాపారులు అనధికారికంగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. వారపు సంతల్లో అధికంగా విక్రయాలు జరుగుతున్నాయని, లైసెన్స్ లేకుండా విక్రయిస్తూ పట్టుబడితే పోలీసు కేసులు పెడతామన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, జూలై 30: మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, పెదబయలు, కుమడ, సంగడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల మార్గంలో అడుగడుగునా పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి, గ్రామ పొలిమేర వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పాదచారుల చేతి సంచులు, బ్యాగులను పరిశీలించారు. మారుమూల గ్రామాలకు వెళ్లే వాహనాల నెంబర్లను, ప్రయాణికుల వివరాలను రికార్డు చేస్తున్నారు. అలాగే బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో రహదారులు, వంతెనలు, కల్వర్టులు పొడవునా తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.